క్లుప్తంగా

వివేకానంద ఆశయసాధనకు యువత కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

అల్లాదుర్గం(మెదక్): స్వామి వివేకానంద ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జీవిత చరిత్రపై మంగళవారం అల్లాదుర్గం బాలుర పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి యువత పైనే ఉందని వివేకానందుడు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ధనుంజయ్య, గురునాథ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెంకట్‌స్వామి

శివ్వంపేట(నర్సాపూర్): చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ డైరెక్టర్ వెంకట్‌స్వామి అన్నారు. మంగళవారం శివ్వంపేట ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ నెల 13 వరకు ఎలాంటి రుసుము లేకుండా అడ్మిషన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట మండల ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జ్ రమేశ్, పీడీ ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని ఓపెన్‌స్కూల్‌లో ఇంటర్మీడియెట్, ఎస్సెస్సీలో చేరేందుకు ఈ నెల 13 ఆఖరు తేదీ అని పేట ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ విఠల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు జీరాక్స్ కాపీని స్థానిక కార్యాలయంలో అందజేయాలన్నారు.

మల్లన్న ఆలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు



ఒగ్గు కథ చెబుతున్న కళాకారులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీ కేతకి భ్రమరాంబ సమేత శ్రీమరకత మల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో దేవతా పూజ, నాగవేల్లి తదితర పూజలు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని ప్రజలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఒగ్గు కళాకారులు ఒగ్గు కథ ఏర్పాటు చేయగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విన్నారు. ఇదిలా ఉండగా పూజల్లో భక్తులతో పాటు ఆయా పార్టీల నాయకులు హాజరయ్యారు.

బీఆర్ఎస్ నాయకుల హర్షం

నిజాంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్డు మరమ్మతులపై మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.2 కోట్ల.70 లక్షలతో పాటు మండలంలోని కబురాస్తాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎంపీపీ సిద్ధరాములు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు లహరిరెడ్డి, బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాయిని లక్ష్మణ్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. చిన్నశివునూర్ గ్రామంలో పది రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. ఈ విషయం సర్పంచ్ అశోక్, భగీరథ అధికారులకు తెలియజేసినా.. అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదు. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో ప్రతిరోజు నీటి సరఫరా చేస్తున్నారు.

నేడు మహిళా చట్టాలపై అవగాహన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళా చట్టాలు, బాల్య వివాహాలు, రక్తహీనత, పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయని సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి హాజరు కానుందన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు హాజరుకావాలని కోరారు.

అధికారులు రాకుంటే ఎలా?

- రామాయంపేట మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షపతి

రామాయంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు రాకుంటే సమస్యలు ఎవరికి చెప్పాలని సభ్యులు ప్రశ్నించారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఝాన్సిలింగాపూర్‌లో అదనంగా కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని సర్పంచ్ పంబాల జ్యోతి ఆరోపించారు. ఝాన్సిలింగాపూర్ పెద్ద చెరువు అలుగు నిర్మించాలని కోరారు. సమావేశాలకు రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు కోరగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంపీడీఓ ఉమాదేవి వివరణ ఇచ్చారు. రాయిలాపూర్ సర్పంచ్ నర్సాగౌడ్, ఎంపీటీసీ నాగులు మాట్లాడుతూ.. మండలంలోని ఐదు గ్రామాలు నిజాంపేట ట్రాన్స్‌కో పరిధిలో ఉన్నాయని, నిజాంపేట ఏఈని సమావేశానికి రప్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 14 క్రీడా మైదానాలకు స్థలం కేటాయించామని ఉపాధి పథకం ఏపీఓ శంకర్ పేర్కొన్నారు. సర్పంచ్‌లు జ్యోతి, మల్లేశం మాట్లాడుతూ.. ఐకేపీలో ఝాన్సిలింగాపూర్, శివ్వాయపల్లి గ్రామాల్లో సీఏలను కొత్తగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణమాట్లాడుతూ.. నాలుగెకరాలు ఉన్న రైతులకు రైతుబంధు డబ్బులు జమయ్యాయయని తెలిపారు. మండలంలో ఇంకా 936 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని, త్వరగా చేయించుకోవాలని కోరారు. గతేడాది ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 30 మంది రైతులు పలు కారణాలతో మృతిచెందగా, 19 మందికి రైతు బీమా అందినట్లు ఏఓ పేర్కొన్నారు.

భవన నిర్మాణ పనులు షురూ

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్: ఈనెల 8న 'బిల్లులు రాక.. పనులు జరగక' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారుల సూచనల మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ స్పందించి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. కాగా మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతో మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పలువురు నాయకులు అధికారులతో పనులను పరిశీలించారు. కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, సకాలంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కమిషనర్ వెంకట్‌గోపాల్‌ను ఆదేశించారు. పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజిటేరియన్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మరో రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.



సూచనలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

సత్ఫలితాలు ఇస్తున్న మౌలిక భాష సామర్థ్యాలు



ఉపాధ్యాయురాలి బోధన పరిశీలిస్తున్న నోడల్ అధికారి విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మౌలిక భాషా, గణిత సామర్థ్యాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని నోడల్ అధికారి విఠల్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అజ్జమర్రి, ఫైజాబాద్, చిట్కుల్ తండా, చిలప్‌చెడ్ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల్లో మౌలిక భాష, గణిత సామర్థ్యాల కార్యక్రమంలో భాగంగా విఠల్, ఉపాధ్యాయుల పాఠ్యబోధన, విద్యార్థుల భాష, గణిత సామర్థ్యాలతో పాటు వారి ప్రతిస్పందనలను పరిశీలించారు. ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుడు మృతి చెందితే భార్యకు పెన్షన్

శివ్వంపేట(నర్సాపూర్): పెన్షన్ నమోదులో ప్రభుత్వం పలు అవకాశాలు కల్పించిందని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందితే భార్యకు (నామిని) స్పౌస్ కింద పెన్షన్ నమోదుకు ఆసరా పెన్షన్ పోర్టల్ నందు అవకాశం కల్పించిందని చెప్పారు. మండలంలో పెన్షన్ దారులు మృతి చెందిన వారుంటే వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అందుకు సంబంధించి నామిని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో పాటు చనిపోయిన పెన్షన్ దారుని మరణ ధ్రువీకరణ పత్రం జతపరచాలని చెప్పారు. రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని సిబ్బందికి వివరించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నవీన్‌కుమార్

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగోడ్(మెదక్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగోడ్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7–10 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 15 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు జనరల్ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలన్నారు.

ప్రవేశాల షెడ్యూల్..

ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ చెప్పారు. ఏప్రిల్ 8 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 16న 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుందని, 17–10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

మే 15న ఫలితాలు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలు. మే 15న వెలువడతాయని స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు. పాఠశాలల వారీగా ఎంపికైనవారి జాబితా మే 24న నోటీసు బోర్డుపై ఉంచుతామన్నారు. జూన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో తరగతులను నిర్వహిస్తామని తెలిపారు.

పేటలోని మోడల్ స్కూల్‌లో..

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం 2023–24కి గాను ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125, ఓసీలకు రూ.200 పరీక్ష ఫీజు ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ అవగాహనపై కళాశాత



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదేశాల మేరకు మెదక్ డిపో మేనేజర్ రవిచందర్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో కళాజాత నిర్వహించారు. ఇందులో భాగంగా పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ.. ప్రజల వద్దకు ఆర్టీసీ పేరుతో రాయితీలను గురించి వివరించారు. ఆర్టీసీ ఆదరించండంటూ ఆర్టీసీ అందిస్తున్న సేవలను గురించి వివరించారు. ఆర్టీసీ బస్సులు ఎక్కడం సురక్షితం, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం వద్దంటూ పలు సూచనలు చేశారు. ప్రజలంతా ఆకర్షితులయ్యేలా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ లక్ష్మణ్, ఏఎస్ఐ దుర్గయ్య, రిటైర్డ్ ఉద్యోగి పట్లోళ్ల నర్సప్ప, కళాకారులు సంపత్, హరి, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘనపూర్ గ్రామ శివారులోని ఐఎంఎల్ డిపో గ్రామానికి చెందిన నిరుద్యోగులకు హమాలీ పని కల్పించాలని నిరుద్యోగులు చేపట్టిన దీక్ష మంగళవారం 300వ రోజుకు చెరుకుంది. డిపో ఎదుట వారు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే కొల్చారం నుంచి జిల్లా కేంద్రంలో పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

డబ్బుల కోసమే తప్పుడు ఆరోపణలు

వెల్దుర్తి(తూప్రాన్): మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేసినా, అమ్మిన వ్యక్తితో కలిసి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు తమ కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండలంలోని మంగళపర్తి గ్రామానికి చెందిన లక్ష్మీనర్సమ్మ అనే మహిళ ఆరోపించింది. యశ్వంతరావ్‌పేట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సత్తయ్య అనే వ్యక్తి నుంచి అదే గ్రామ శివారులో గతేడాది మే నెలలో మార్కెట్ ధరకు అనుగుణంగా భూమి కొనుగోలు చేశామన్నారు. మొత్తం డబ్బులు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ప్రస్తుతం భూమి ధర ఒక్కసారిగా పెరగడంతో డబ్బుల ఆశతో ఎర్రొల్ల సత్తయ్యతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు న్యాయబద్ధంగా భూమి కొనలేదని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. తన కుమారుడు నవీన్‌గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారన్నారు. ఈ విషయంలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఎస్పీ కార్యాలయంలో ఈ నెల 2న ఫిర్యాదు చేశామన్నారు. తమపై తప్పుడు ఆరోపణలు మానుకోకుంటే, పరువుకు భంగం కలిగించిన విషయమై కోర్టులో పరువు నష్టం దావా వేస్తామన్నారు.



పట్టా పాస్‌బుక్ చూపిస్తున్న బాధిత మహిళా రైతు

దర్గాలో ప్రార్థనలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మంగళవారం రాత్రి పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



ప్రార్థనలు చేస్తున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

ముందస్తు సంక్రాంతి సంబరాలు



పాఠశాలలో సంక్రాంతి సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

మెదక్ రూరల్: మెదక్, హవేళిఘనపూర్ మండలాల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. ఇందులో భాగంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను పెట్టారు. మండలంలోని మంబోజిపల్లి గీతా ఉన్నత పాఠశాలలో సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపల్ మాధవి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు చూపించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఇళ్ల స్థలాలకు హద్దులు చూపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతకు గౌతోజీగూడెం గ్రామస్తులు మంగళవారం మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆమె స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని హామీనిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, ఉప సర్పంచ్ రేణుకుమార్, వార్డు సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, నర్సింలు, స్వామి, లక్ష్మీనారాయణ, కృష్ణస్వామి, కల్యాణ్ తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న గౌతోజీగూడెం గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ జోడో యాత్రను విజయవంతం చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే హాత్‌సే హాత్‌జోడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ డెలిగెట్ సోమన్నగారి రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద బ్లాక్ మండల కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే హాత్‌సే హాత్‌జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి, శ్రీనివాసరావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

◆ పంట వివరాలు నమోదు

రామాయంపేటమెదక్): మండల పరిధిలోని కోమటిపల్లిలో మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి రాజు రైతులకు సంబంధించి పంటల వివరాలు నమోదు చేశారు.

◆ ఎమ్మెల్యేని కలిసిన జంగరాయి నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగారయి బీటీ రోడ్డు పనులకు అదనంగా రూ.33 లక్షలు మంజూరు చేసినందుకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని మండలంలోని జంగరాయి గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచ్ జ్యోతి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, కోఆపరేటివ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు, రామాయంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేఘమాల రవీందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సురేశ్, ఉపసర్పంచ్ లక్ష్మీపతి, డైరెక్టర్ సిద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కసాన్‌పల్లి తండా పాఠశాల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని కసాన్‌పల్లి తండా ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయుడు కనకయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హోలియా, నాయకులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి

రామాయంపేట(మెదక్): పదో తరగతి పరీక్షల్లో మార్పులు చేసి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలని ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో చాయిస్ ప్రశ్నల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ రెగ్యూలర్‌గా కాకుండా రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

◆ కరీంనగర్ పాఠశాలలో బాలసభ

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికను ఏర్పాటు చేసి విద్యార్థులతో నాటికలు, బుర్ర కథ, నృత్య రూపకంలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు బాలసభను ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం నీరజ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

కౌడిపల్లి(నర్సాపూర్): లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వడంతోపాటు రికవరీ చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వేణుగోపాల్‌రావు తెలిపారు. మంగళవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ మండలాల బ్యాంక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంమేరకు రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ, వ్యాపార తదితర రుణాల మొండి బకాయిలు కట్టించాలని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం తిమోతి, వివిధ మండలాల మేనేజర్లు పాల్గొన్నారు.

◆ బగలాముఖీ బాలాలయంలో విశేష పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో బగలాముఖీ బాలాలయంలో మంగళవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపసాకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే నెల 7 నుంచి 10 వరకు అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

◆ సన్మానం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణానికి చెందిన పండితుడు డాక్టర్ శాస్త్రుల కృష్ణమూర్తిని మెదక్ ఏఎంసీ మాజీ చైర్మన్లు ఘనంగా సన్మానించారు. జ్యోతిష్య శాస్త్రంలో పాండిత్యం సాధించిన వాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి శాస్త్రుల కృష్ణమూర్తి సిద్ధాంతి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మేడి మధుసూదన్ రావు, అకిరెడ్డి కృష్ణా రెడ్డి, నాయకులు అరవింద్, ప్రకాష్ తదితరులు సన్మానించారు.

◆ హోరాహోరీగా కబడ్డీ పోటీలు



పాపన్నపేట(మెదక్): జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని పాపన్నపేటలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. కార్యక్రమంలో సర్పంచ్ గురుమూర్తిగౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్, రైసాస మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింలు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశం, రిటైర్డ్ ఎంఈఓ మహేందర్‌రెడ్డి, లైబ్రేరియన్ నరేందర్‌రెడ్డి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ 'ఆపరేటర్లపై వేధింపులు మానుకోవాలి'

పాపన్నపేట (మెదక్): జిల్లాలోని ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఆపరేటర్ లపై నర్సాపూర్ విద్యుత్ ఏడీఈ వేధింపులు వెంటనే మానుకోవాలని యూఈఈ యూ(సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.చంద్ర భానప్ప మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థ నియమ నిబంధనల ప్రకారం ప్రతి సబ్ స్టేషన్లలో నలుగురు ఆపరేటర్‌లు విధులు నిర్వహించాల్సి ఉండగా, కేవలం ముగ్గురు, మరికొన్ని చోట్ల ఇద్దరు, రిటైర్మెంట్ అయిన కార్మికులు, ఎలాంటి విద్యార్హతలు లేని కార్మికులతోనే విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నర్సాపూర్ ఏడీఈ ఆపరేటర్లను తీవ్రంగా వేధిస్తూ లైన్ బ్రేక్ డౌన్లలోకి వెళ్లాలని, బిల్లులు వసూలు చేయాలని, రీడింగ్ తీయాలని హుకూం జారీ చేస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో అన్ని సబ్‌స్టేషన్‌ల ముందు ఆపరేటర్లతో ధర్నా, రాస్తారోకో కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

◆ అక్రమ విద్యుత్ కనెక్షన్లు రైతులే తొలగించాలి

మాకు ఏలాంటి సంబంధం లేదు: పోర్‌మెన్

అల్లాదుర్గం(మెదక్): అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఉంటే విద్యుత్ సిబ్బంది అధికారులు తొలగించి చర్యలు తీసుకుంటారు. అల్లాదుర్గం విద్యుత్ సిబ్బంది, అధికారులు మాత్రం వ్యవసాయ విద్యుత్ బోర్లకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఉంటే రైతులే తొలగించాలని, లేకుంటే ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడి చెడిపోతే తాము చేయించలేమని పోర్‌మెన్ రమేశ్ రైతులతో చెప్పారు. అల్లాదుర్గం శివారులో 15 రోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండుసార్లు పాడైపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పాపన్నపేటకు మరమ్మతులకు తీసుకెళ్తే అక్కడి సిబ్బంది ఇది దొంగ ట్రాన్స్‌ఫార్మర్ అని దానికి మరమ్మతులు చేయమని వేధింపులకు గురి చేస్తున్నట్లు రైతులు చెప్పారు. నాలుగు రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోతే.. మాకేం సంబంధం లేదని విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం విశేషం.

◆ జిల్లా కార్యవర్గంలో చేగుంట ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్) తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గంలో పలువురు మండల ఉపాధ్యాయులకు చోటు లభించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా చక్రవర్తి, సుజాత, జిల్లా కార్యదర్శులుగా సురేందర్, వాసు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మల్లారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీధర్, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వై.మాధవి తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికపై చేగుంట, నార్సింగి, మాసాయిపేట మండలాల తపస్ సంఘం బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

◆ హరిచంద్‌తండాకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయండి



కౌడిపల్లి(నర్సాపూర్): హరిచంద్‌తండా పంచాయతీకి డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ లక్యానాయక్ తండావాసులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని హరిచంద్‌తండా సర్పంచ్ లక్యానాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీం, తండావాసులు శ్రీనివాస్, చత్రునాయక్ తదితరులు కలిసి విజ్ఞప్తి చేశారు. తండాలో ఇళ్లు లేని వారు అధికంగా ఉన్నారని వాపోయారు. కాగా సంక్రాంతి తర్వాత ఇళ్లు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు.

పాఠశాలల్లో క్రీడాపోటీలు ప్రారంభం

మెదక్ రూరల్: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని రూరల్ సీఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మెదక్, హవేళిఘనపూర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్‌రెడ్డి, శేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ నేడు ప్రత్యేక సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట మండల సర్వసభ్య ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహిస్తున్న ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ నవీన్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు కంటి వెలుగుపై చర్చించేందుకు ఉదయం 11–30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది విధిగా హాజరు కావాలని సూచించారు.

◆ నేడు ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం

నిజాంపేట(మెదక్): జిల్లా కేంద్రంలో ఐబీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నేడు జిల్లా కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో దళిత బంధు, బీజేపీ అనుసరిస్తున్న విధి విధానాలు, భవిష్యత్ కార్యాచరణ కరపత్రం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు మండల అధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు అందరూ హాజరై సమావేశం జయప్రదం చేయగలరని విజ్ఞప్తి చేశారు.